
సాక్షి వికారాబాద్

శుక్రవారం । 4 । అక్టోబర్ । 2024



రాగుల సాగు లాభాలు బాగు

ప్రధాన ఆహార పంటల్లో రాగి పంట ఒకటి. చిరు ధాన్యంగా రాగి పంటను రైతులు పండిస్తున్నారు.

8లో▸



ధాన్యం కొనుగోలుకు..

వరి ధాన్యం సేకరణకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

8లో▸



పల్లె పోరుకు సిద్ధం

అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ముగిశాయి. తదుపరి పంచాయతీ ఎన్నికల సమయం ఆసన్నమైంది.

9లో▸

న్యూస్‌రీల్

థ్యాంక్యూ.. సర్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన పట్నం మహేందర్‌రెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న పట్నం మహేందర్‌రెడ్డి

తాండూరు: తెలంగాణ రాష్ట్ర శాసన మండలి చీఫ్ విప్‌గా నియమితులైన ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు మనోహర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులతో కలిసి సీఎం క్యాంపు కార్యాలయంలో రేవంత్‌రెడ్డిని సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా రాజకీయాలు, అభివృద్ధి పనులపై సీఎం ఆరా తీశారు. ఇదిలా ఉండగా పట్నం మహేందర్‌రెడ్డి కోసం రాష్ట్ర సచివాలయంలో ప్రత్యేక చాంబర్‌ను ఏర్పాటు చేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ యూరప్ పర్యటనలో ఉన్నారు. ఆయన వచ్చిన తర్వాత పట్నం మహేందర్‌రెడ్డి చీఫ్ విప్‌గా పదవీ బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం.

రాష్ట్రస్థాయి పోటీలకు విశ్విక



గోల్డ్ మెడల్‌తో విశ్విక

పరిగి: జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో పరిగి పట్టణానికి చెందిన వార్ల విశ్విక బంగారు పతకం సాధించింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గురువారం వికారాబాద్ పట్టణంలో జరిగిన అండర్ -14 తైక్వాండో పోటీల్లో విశ్విక విజేతగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది.

సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలి

అనంతగిరి: జిల్లాలో ఎస్‌ఏ, పండిట్, పీఈటీ, పీడీ, ఎస్‌జీటీ పోస్టులకు ఎంపికైన డీఎస్సీ అభ్యర్థులు వారివారి సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. ఎంపికైన అభ్యర్థుల జాబితా కలెక్టరేట్ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని తెలిపారు. ఎంపిక చేసిన కేంద్రాల్లో ఉదయం 10నుంచి సాయంత్రం 5గంటల వరకు అధికారులు సర్టిఫికెట్లను పరిశీలిస్తారని తెలిపారు. శుక్ర, శనివారం మాత్రమే మిగిలి ఉన్నందున అభ్యర్థులు సర్టిఫికెట్లతో రావాలని సూచించారు.

నాలుగు ఉద్యోగాలకు శ్రీనివాస్ అర్హత



కొడంగల్ రూరల్: నిరుపేద కుటుంబానికి చెందిన యువకుడు నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత సాధించాడు. మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన చాకలి శ్రీనివాస్ గత నెల 30న వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో సోషల్ స్టడీస్‌లో రాష్ట్రస్థాయి 2వ ర్యాంక్, జిల్లా స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించాడు. ఇటీవల వెలువడిన గురుకుల ఫలితాల్లో టీజీటీ, పీజీటీ, హాస్టల్ వార్డెన్ ఉద్యోగాలకు జోన్ 6లో 17వ ర్యాంకు సాధించాడు. ఒకేసారి నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత సాధించడంపై కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.



తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి

తాండూరుకు కాయకల్ప

రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి

- కేంద్ర బృందం సర్వేలో 94శాతం మార్కులు
- మూడోసారి వరించిన అవార్డు
- హర్షం వ్యక్తం చేస్తున్న వైద్యాధికారులు

తాండూరు: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కాయకల్ప అవార్డుల్లో తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి రాష్ట్ర స్థాయిలో సత్తాచాటింది. 94శాతం మార్కులతో మొదటి స్థానంలో నిలిచి అవార్డును సొంతం చేసుకుంది. ఏటా కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు అందుతున్న సేవలపై సర్వే చేసి అన్ని విభాగాల్లో అత్యుత్తమ సేవలు అందిస్తున్న ఆస్పత్రులకు కాయకల్ప అవార్డులను అందజేస్తోంది. ఈ రేసులో రాష్ట్రస్థాయిలో తాండూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మొదటి స్థానంలో నిలిచింది. స్వచ్ఛభారత్ అభియాన్, నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో 2023 – 24 సంవత్సరానికి గాను ప్రభుత్వ ఆస్పత్రుల నిర్వహణపై కాయకల్ప అవార్డు ఫలితాలను వైద్య ఆరోగ్య శాఖ గురువారం విడుదల చేసింది. రాష్ట్రంలోని అన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల్లో పారిశుద్ధ్య నిర్వహణ, బయో మెడికల్ వేస్టేజ్ నిర్వహణ, హైజిన్ ప్రాధాన్యత, ఇన్ఫెక్షన్ కంట్రోల్ ప్రాక్టీస్ తోపాటు తదితర అంశాలపై కాయకల్ప పోటీలు జరిగాయి. అందులో రాష్ట్రంలోని పలు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రులు, సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు పోటీ పడ్డాయి. ఈ పోటీల్లో రాష్ట్రంలో 94శాతం మార్కులతో తాండూరులోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, నగరంలోని కింగ్‌కోఠి ప్రభుత్వ ఆస్పత్రి మొదటి స్థానంలో నిలిచాయి. రెండో స్థానంలో గజ్వేల్‌లోని ప్రభుత్వ ఆస్పత్రి చోటు దక్కించుకుంది. మూడోసారి అవార్డు లభించడంతో జిల్లా ఆస్పత్రి వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

అవార్డుతోపాటు రూ.25 లక్షలు

తాండూరు ఆస్పత్రికి మూడోసారి కాయకల్ప అవార్డు వచ్చింది. 2020 – 21 – 22లో వరుసగా రెండు సార్లు అవార్డు వరించింది. గతేడాది రేసులో వెనుకబడింది. 2023 – 24 సంవత్సరంలో కేంద్ర సర్వే బృందాన్ని మెప్పించింది. దీంతో మూడోసారి అవార్డు వచ్చింది. ఆస్పత్రి సూపరింటెండెంట్ రవిశంకర్ త్వరలో ఢిల్లీలో వైద్య ఆరోగ్య శాఖ నుంచి అవార్డును అందుకోనున్నారు. అవార్డుతో పాటు ఆస్పత్రికి రూ.25 లక్షలను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయనుంది. ఈ మొత్తంలో 25 శాతం నగదును వైద్యులు, వైద్య సిబ్బందికి అందజేయాల్సి ఉంటుంది. మిగిలిన 75 శాతం నిధులను కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం వివిధ అభివృద్ధి పనులకు కేటాయించాలి.

అవార్డు రావడం సంతోషంగా ఉంది



తాండూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి రాష్ట్రస్థాయి కాయకల్ప అవార్డు రావడం సంతోషంగా ఉంది. గతంలో రెండు సార్లు అవార్డు వచ్చింది. అవార్డు రావడం వెనుక ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది సమష్టి కృషి ఫలితమే. ప్రతి ఆదివారం ఆస్పత్రిలో నిర్వహించే డ్రై డే కార్యక్రమానికి అందరూ సహకరించారు. ఆస్పత్రిలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రజాప్రతినిధులు సహకరించారు. అవార్డు రావడానికి కష్టపడిన వైద్యులు, వైద్య సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులకు అభినందనలు.

– దర్మిది రవిశంకర్, ఆస్పత్రి సూపరింటెండెంట్

త్వరలో సోలార్ వెలుగులు

- కొండారెడ్డిపల్లిని సందర్శించిన ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ
- పైలెట్ ప్రాజెక్టుగా గ్రామం ఎంపిక
- అధికారులను సన్మానించిన స్థానికులు



గ్రామంలో పర్యటిస్తున్న సీఎండీ ముషారఫ్ ఫరూఖీ, కలెక్టర్ ప్రతీక్‌జైన్ తదితరులు

కొడంగల్: మున్సిపల్ పరిధిలోని కొండారెడ్డిపల్లిని గురువారం దక్షిణతెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థల సీఎండీ ముషారఫ్ ఫరూఖీ, కలెక్టర్ ప్రతీక్ జైన్, టీజీ రెడ్‌కో చైర్మన్ అనిలా, కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, ఆర్‌ఆర్ జోన్ సీఈ ఆనంద్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు గ్రామస్తులతో మాట్లాడారు. కొండారెడ్డిపల్లి గ్రామానికి సోలార్ విద్యుత్ అందించడానికి ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిందని తెలిపారు. త్వరలో ప్రతి ఇంటికీ సోలార్ విద్యుత్ అందుతుందని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ట్రాన్స్‌కో సిబ్బంది చేసిన సర్వేలో ఏమైనా సమస్యలు ఉంటే మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసి సరి చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సోలార్ వ్యవస్థకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సీఎండీ, కలెక్టర్, అధికారులను సన్మానించారు. కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా ఎస్ఈ సంజీవరెడ్డి, తాండూరు డీఈఈ భాను ప్రసాద్, కొడంగల్ ఏడీఈ నవీన్‌కుమార్, తాండూరు ఏడీఈ ఆదినారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం దత్తత గ్రామం కొండారెడ్డిపల్లి

2014లో కొడంగల్ ఎమ్మెల్యేగా రేవంత్‌రెడ్డి రెండోసారి గెలిచిన తర్వాత కొండారెడ్డిపల్లి గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. ఆయన హయాంలో గ్రామ అభివృద్ధికి తనవంతు కృషి చేశారు. రోడ్డు లేని గ్రామానికి రహదారి మంజూరు చేయించారు. కొడంగల్‌లోని తన ఇంటి ముందు నుంచే (లాహోటీ కాలనీ) బీటీ రోడ్డు వేయించారు. గ్రామానికి అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు ఇప్పించారు. మురుగు కాల్వల నిర్మాణానికి, సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. పాఠశాలకు అదనపు తరగతి గదులు మంజూరు చేయించారు. ప్రస్తుతం రాష్ట్రంలోనే తొలిసారిగా కొండారెడ్డిపల్లికి కరెంటు కొరత లేకుండా చేస్తున్నారు. సోలార్ పవర్‌ను అందించనున్నారు. ఈ విషయంలో రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు సర్వే చేసి నివేదికను ప్రభుత్వానికి ఇచ్చారు. గ్రామంలో 153 ఇండ్లకు గాను ఒక్కో ఇంటికి 3 కిలోవాట్ల చొప్పున 459 కిలోవాట్ల సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేయనున్నారు. త్వరలో వ్యవసాయ బోర్లకు కూడా సోలార్ వ్యవస్థను బిగించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.



విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడుతున్న సీఎండీ



పార్టీలో చేరిన వ్యక్తికి సభ్యత్వ నమోదు పత్రం అందజేస్తున్న ఆనంద్‌గౌడ్

బీజేపీ వైపు ప్రజల చూపు

- ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్
- రికార్డు స్థాయిలో సభ్యత్వ నమోదు చేయాలని పిలుపు

తాండూరు టౌన్: నమ్మించి మోసం చేసే రాజకీయ పార్టీల వైపు వెళ్లకుండా ప్రజలు బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారని ఆ పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ అన్నారు. గురువారం తాండూరులో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బొప్పి శ్రీహరి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో ఇష్టానుసారంగా అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రజలు ఇకపై ఆ పార్టీలను నమ్మే స్థితిలో లేరన్నారు. ప్రత్యామ్నాయంగా బీజేపీ వైపు అడుగులు వేస్తున్నారని పేర్కొన్నారు. దీనిలో భాగంగానే సభ్యత్వ నమోదు కార్యక్రమం శరవేగంగా దూసుకుపోతోందన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని ప్రజలు భావిస్తున్నారని అన్నారు. రికార్డు స్థాయిలో సభ్యత్వం చేయించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఓబీసీ డాటా సెల్ రాష్ట్ర కన్వీనర్ భానుప్రకాష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్ కుమార్, నాయకులు శాంత్‌కుమార్, కృష్ణ ముదిరాజ్, శ్రీనివాస్ గౌడ్, భద్రేశ్వర్, బాలి శివకుమార్, నాగారం మల్లేశం, సుదర్శన్ గౌడ్, శ్రీకాంత్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అధికారులపై వేటు

నలుగురు బదిలీ, ఒకరి సస్పెన్షన్



సంతోష్, తాండూరు పట్టణ సీఐ



అశోక్, తాండూరు రూరల్ సీఐ



నాగరాజు, వికారాబాద్ టౌన్ సీఐ



శంకర్, యాలాల ఎస్ఐ



గిరి, పెద్దేముల్ ఎస్ఐ

అనంతగిరి/తాండూరు: జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను నియంత్రించడం తోపాటు పలు కేసులను నిర్లక్ష్యం చేశారనే కారణాలతో ముగ్గురు సీఐలు, ఇద్దరు ఎస్ఐలపై పోలీసు ఉన్నతాధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు మల్టీజోన్– 2 ఐజీ సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తాండూరు సీఐ సంతోష్, కరన్‌కోట సీఐ అశోక్‌ను ఐజీ కార్యాలయానికి అటాచ్ చేయగా వికారాబాద్ టౌన్ సీఐ నాగరాజుపై సస్పెన్షన్ వేటు వేశారు. వీరితో పాటు పెద్దేముల్ ఎస్ఐ గిరి, యాలాల ఎస్ఐ శంకర్‌ను ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఇదిలా ఉండగా సీఐ నాగరాజు జోగిపేటలో విధులు నిర్వర్తించిన సమయంలో బాలిక అత్యాచారం కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు అవకతవకలకు పాల్పడ్డారనే అభియోగంపై సస్పెన్షన్ వేటు వేశారు.

డిజిటల్ కుటుంబ సర్వే షురూ..

- పైలెట్ ప్రాజెక్టు కింద నాలుగు వార్డులు, నాలుగు గ్రామాలు
- ఇన్‌చార్జులుగా అడిషనల్ కలెక్టర్లు, సబ్ కలెక్టర్, ఆర్డీఓ
- ఐదు పని దినాల్లో సర్వే ప్రక్రియ పూర్తి చేయాలని నిర్ణయం
- మొదటి రోజు కొడంగల్‌లో..
- పర్యవేక్షించిన కలెక్టర్ ప్రతీక్‌జైన్



కొడంగల్‌లో డిజిటల్ కుటుంబ కార్డు సర్వేలో పాల్గొన్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్: జిల్లాలో డిజిటల్ కుటుంబ సర్వే ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డు అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా అధికారులు ప్రతి మున్సిపాలిటీలోని ఒక వార్డును, ప్రతి మండలంలోని ఒక గ్రామాన్ని ఎంపిక చేశారు. వీటిలో కుటుంబ సర్వే చేపట్టనున్నారు. ఐదు పని దినాల్లో సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని నిర్ణయించారు. పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్లు టీం లీడర్లుగా వ్యవహరిస్తారు. గ్రామాల్లో సర్వే బృందాలకు ఎంపీడీఓలు టీం లీడర్లుగా ఉంటారు. నియోజకవర్గాల వారీగా సర్వేని అడిషనల్ కలెక్టర్లు, సబ్ కలెక్టర్, ఆర్డీఓ పర్యవేక్షిస్తారు. సర్వే బృందాల్లో మున్సిపాలిటీల్లో అయితే అంగన్‌వాడీ కార్యకర్త, జూనియర్ అసిస్టెంట్, రిసోర్స్ పర్సన్, వార్డు ఆఫీసర్ ఉంటారు. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శి, కమ్యూనిటీ కో–ఆర్డినేటర్(సీసీ), అంగన్‌వాడీ కార్యకర్త సభ్యులుగా ఉంటారు. కొడంగల్‌లో గురువారం ప్రారంభమైన కుటుంబ సర్వే ప్రక్రియను కలెక్టర్ ప్రతీక్ జైన్ పరిశీలించారు.

ఎంపిక చేసిన ప్రాంతాలు ఇవే..

డిజిటల్ కుటుంబ సర్వేకు సంబంధించి జిల్లాలో నియోజకవర్గానికి రెండు చొప్పున మొత్తం ఎనిమిది ఆవాసాలు ఎంపిక చేశారు. కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డును ఎంపిక చేయగా అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ) లింగ్యానాయక్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 13వ వార్డు(కొంపల్లి), మర్పల్లి మండలంలోని కురుగుంట గ్రామాన్ని ఎంపిక చేయగా అడిషనల్ కలెక్టర్(లోకల్ బాడీస్) సుధీర్ ఇన్‌చార్జ్‌గా ఉంటారు. తాండూరు మున్సిపల్ పరిధిలోని 1వ వార్డు (మల్‌రెడ్డిపల్లి), యాలాల మండల కేంద్రాన్ని ఎంపిక చేయగా తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. పరిగి మున్సిపల్ పరిధిలోని 13వ వార్డు, దోమ మండలంలోని కమ్మంనాచారం గ్రామాన్ని ఎంపిక చేయగా వికారాబాద్ ఆర్డీఓ వాసుచంద్ర ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు.

సర్వే ఇలా..

ఎంపిక చేసిన గ్రామాల్లో సర్వే బృందాలు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తారు. కుటుంబ పెద్దగా మహిళను నిర్ణయిస్తారు. ఒకే కుటుంబంలో ఇద్దరు మహిళలు(కోడలు, అత్త) ఉంటే ఎవరిని కుటుంబ పెద్దగా పేర్కొనాలి అనే నిర్ణయ అధికారాన్ని ఆ కుటుంబానికే వదిలేస్తారు. గ్రామంలో ఇల్లు ఉండి మరో చోట జీవనం సాగిస్తుంటే ఏదైనా ఒకే చోట నమోదు చేస్తారు. ఆధార్ జాతీయ వ్యక్తిగత గుర్తింపు కార్డు కాగా.. ఫ్యామిలీ డిజిటల్ కార్డు రాష్ట్ర కుటుంబ గుర్తింపు కార్డు కానుంది. ఇందులో వ్యక్తిగత వివరాలు మాత్రమే నమోదు చేస్తారు. ఆర్థిక, ఆస్తుల వివరాలు నమోదు చేయరు. ఇందులో పేరు, జెండర్, పుట్టిన తేదీ, వయసు, కుటుంబ యజమానితో రిలేషన్, ఫోన్ నంబర్, ఆధార్ నంబర్, అడ్రస్ నమోదు చేస్తారు. కుటుంబ సభ్యులు అందరూ ఉండే ఒక ఫొటో కూడా తీసుకుంటారు.

మహిళల పేరిట కార్డు: కలెక్టర్

కొడంగల్: మహిళల పేరు మీదే ఫ్యామిలీ డిజిటల్ కార్డు వస్తుందని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. గురువారం కొడంగల్ మున్సిపాలిటీలోని 8వ వార్డులో కుటుంబ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో మాట్లాడారు. ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. కార్డులో అన్ని వివరాలు ఉంటాయన్నారు. సర్వే బృందాలు వచ్చినప్పుడు అందుబాటులో ఉండాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తహసీల్దార్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితాపై అఖిల పక్ష నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పుల గురించి చర్చించారు. కార్యక్రమంలో అఖిల పక్ష నాయకులు కృష్ణంరాజు, ఇందనూర్ బషీర్, మధుయాదవ్, రమేష్‌బాబు, శంకర్‌నాయక్, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దఅంబర్‌పేట మున్సిపల్ పీఠంపై పండుగల జయశ్రీ

- 24 మంది కౌన్సిలర్లలకు గాను 21మంది ఆమెకే మద్దతు
- తాజా మాజీ చైర్‌పర్సన్ స్వప్న, వ్యక్తిగత కారణాలతో మరో ఇద్దరు గైర్హాజరు

అంతా అనుకున్నట్టే..



జయశ్రీకి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఆర్డీఓ సాయిరాం, కమిషనర్ రవీందర్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట మున్సిపల్ పీఠాన్ని ఎట్టకేలకు 8వ వార్డు కౌన్సిలర్ పండుగుల జయశ్రీ దక్కించుకున్నారు. తాజా మాజీ చైర్‌పర్సన్ చెవుల స్వప్నపై 17మంది కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టి నెగ్గడంతో ఆమె పదవిని కోల్పోయిన సంగతి తెలిసిందే. దీంతో కొత్త చైర్‌పర్సన్ ఎన్నిక కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలోని తట్టి అన్నారం వార్డు కార్యాలయంలో చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కౌన్సిల్ సమావేశంలో 24 మంది కౌన్సిలర్లకు గాను 21 మంది హాజరయ్యారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పండుగుల జయశ్రీకి మద్దతు పలికి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశం అనంతరం స్పెషల్ ఆఫీసర్ సాయిరాం, మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి జయశ్రీకి నియామకపత్రం అందజేశారు. అనంతరం జయశ్రీ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో పాటు స్థానిక కౌన్సిలర్లు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలకు అతీతంగా తనకు స్వచ్ఛందంగా మద్దతు పలికి చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్న కౌన్సిల్ సభ్యులందరి సహకారంతో పురపాలక సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఇద్దరు కౌన్సిలర్లు వ్యక్తిగత కారణాలతో సమావేశానికి హాజరు కాలేకపోయారు. తాజా మాజీ చైర్‌పర్సన్ చెవుల స్వప్న సమావేశానికి హాజరు కాకపోగా ఒంటరిగా మిగిలిపోయారు.

ఎట్టకేలకు నెరవేరిన కల

మున్సిపల్ పీఠాన్ని సొంతం చేసుకోవడానికి ఏడాదిన్నర కాలంగా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న పండుగుల జయశ్రీ కల ఎట్టకేలకు నెరవేరింది. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేగా మల్‌రెడ్డిరంగారెడ్డి గెలుపు తర్వాత, పురపాలక సంఘం పరిధిలోని కౌన్సిలర్లంతా పార్టీలకు అతీతంగా ఆమెను చైర్‌పర్సన్‌గా ఎన్నుకునేందుకు చేసిన ప్రయత్నాలన్నీ విజయవంతం కావడంతో అటు జయశ్రీతో పాటు కౌన్సిలర్లంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

రైలు కింద పడి వృద్ధుడి మృతి

తాండూరు టౌన్‌: రైలు కింద పడి ఓ గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం ఉదయం తాండూరు రైల్వే స్టేషన్‌ యార్డు సమీపంలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుమారు 60 ఏళ్ల వయసున్న ఓ వృద్ధుడు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధారించామన్నారు. మృతుడి ఒంటిపై తెలుపు, ఎరుపు రంగు గల స్వెటర్‌, నీలం రంగు నిక్కర్‌ ధరించి ఉన్నాడన్నారు. స్టేషన్‌ మాస్టర్‌ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని, శవాన్ని తాండూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు చెప్పారు. మృతున్ని గుర్తించిన వారు 87125 13854 నంబర్‌కు ఫోన్‌ చేయాలని కోరారు.

చికిత్స పొందుతూ మహిళ..

మొయినాబాద్‌: కడుపునొప్పి బాధ భరించలేక యాసిడ్‌ తాగిన ఓ మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ సంఘటన మొయినాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్‌ జిల్లా తాండూరుకు చెందిన సున్నం జగ్గమ్మ(28) తన మేనమామ అయిన పులిపర్తి అంబోజీతో కలిసి మూడేళ్లుగా మొయినాబాద్‌ మండలం నజీబ్‌నగర్‌ గ్రామంలో ఉంటున్నారు. మతిస్థిమితం సరిగా లేని జగ్గమ్మ కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతుంది. కాగా బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు విపరీతమైన కడుపునొప్పి రావడంతో బాధ భరించలేక యాసిడ్‌ తాగింది. వెంటనే ఆమెను చికిత్స కోసం నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సహకరిస్తే అభివృద్ధి చేస్తా

కర్ణాటక మాజీ మంత్రి అరవింద్‌ లింబావళి



కోత్లాపూర్‌ రేణుక ఎల్లమ్మ ఆలయంలో కర్ణాటక మాజీ మంత్రి

తాండూరు రూరల్‌: తమ ఇంటి దేవత శ్రీ కోత్లాపూర్‌ రేణుక ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి గ్రామస్తులు సహకరిస్తే మరింత అభివృద్ధి చేస్తానని కర్ణాటక మాజీ మంత్రి అరవింద్‌ లింబావళి అన్నారు. గురువారం మండల పరిధిలోని కోత్లాపూర్‌ రేణుక ఎల్లమ్మ ఆలయంలో కేరళ పూజారులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్నేళ్ల క్రితమే కోత్లాపూర్‌ రేణుక ఎల్లమ్మ ఆలయాన్ని పునర్నిర్మాణం చేయాలని నిర్ణయించుకున్నానన్నారు. అందుకు గ్రామస్తుల సహకారం కావాలని కోరారు. కార్యక్రమంలో ఈవో శేఖర్‌గౌడ్‌, నూతన చైర్మన్‌ నవీన్‌చంద్రరెడ్డి, మాజీ చైర్మన్‌ సందీప్‌రెడ్డి, పీఏసీఎస్‌ డైరెక్టర్‌ వెంకట్రాంరెడ్డి, గ్రామస్తులు ప్రదీప్‌రెడ్డి, జెదీప్‌రెడ్డి, సాయిలు, గోపాల్‌ తదితరులు ఉన్నారు.

అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్‌ అరెస్టు

ఇబ్రహీంపట్నం రూరల్‌: అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్‌ను ఆదిబట్ల పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ వెంకటేశ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్‌, ఆదిబట్ల ఏరియాల్లో ఉన్న లేబర్‌కు గంజాయి అమ్మడానికి ఓ వ్యక్తి వస్తున్నాడనే సమాచారంతో పోలీసులు గస్తీ కాశారు. బొంగ్లూర్‌ సర్వీస్‌రోడ్డు దగ్గర గురువారం సాయంత్రం ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తుక్కుగూడ వైపు నడుచుకుంటూ వెళ్తుండగా అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఒక ప్యాకెట్‌లో ఒకటిన్నర కిలోలు, మరొక ప్యాకెట్‌లో 50 గ్రాముల బ్యాంకాక్‌ గంజాయి లభ్యమైంది. అతడు మహారాష్ట్రకు చెందిన రాం భరత్‌ కల్యాణ్‌గా గుర్తించారు. ఇతడు కేరళ నివాసి అయిన టోబి వద్ద గంజాయి కొనుగోలు చేసి బెంగ్లూర్‌ పరిసరాల్లో విక్రయించేవాడు. గతంలో వివిధ పోలీస్‌స్టేషన్లలో భరత్‌ కల్యాణ్‌పై గంజాయి కేసులు ఉన్నాయని తెలిపారు. ఈ మేరకు విచారణ చేస్తున్నామని పోలీసులు చెప్పారు. మాదకద్రవ్యాలు విక్రయించే మరో వ్యక్తిని అరెస్టు చేసినట్లు సమాచారం.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



మాణిక్యంరెడ్డి (ఫైల్‌)

మొయినాబాద్‌: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన మొయినాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పెద్దమంగళారం గ్రామానికి చెందిన బొద్దు మాణిక్యంరెడ్డి(39) నగరంలో హౌస్‌కీపింగ్‌ పనిచేస్తూ లంగర్‌హౌస్‌లో ఉంటున్నాడు. కాగా ఈ నెల 1న సాయంత్రం పెద్దమంగళారంలోని తన ఇంటికి వచ్చాడు. తన వద్ద ఉన్న కవర్‌ను ఇంట్లో పెట్టి బయటకు వెళ్లాడు. రాత్రి అయినా తిరిగి ఇంటికి రాలేదు. లంగర్‌హౌస్‌ ఇంటికి కూడా వెళ్లలేదు. దీంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వెతికారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో మొయినాబాద్‌ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రాగుల సాగు.. లాభాలు బాగు

- రాగి సంగటి, జావపై మక్కువ చూపుతున్న ప్రజలు
- మార్కెట్‌లో పెరిగిన డిమాండ్‌



రాగి జావ



ఆలేడ్‌లో సాగు చేస్తున్న పంట



రాగి లడ్డూలు

దుద్యాల్‌: ప్రధాన ఆహార పంటల్లో రాగి పంట ఒకటి. చిరు ధాన్యంగా రాగి పంటను పండిస్తారు. పంట కాలం తక్కువ రోజులు కావడంతో ఖరీఫ్‌, రబీ సీజన్లతో పాటు వేసవిలో కూడా రాగిని సాగు చేస్తారు. దీనిలో కాల్షియం అధికంగా ఉండటం, కొవ్వు పదార్థం తక్కువగా ఉండడంతో వరి, గోధుమ కంటే పోషకాల శాతం ఎక్కువగా ఉంటాయి. ఇటీవల మంచి పౌష్టికాహారంగా రాగిని ప్రజలంతా వినియోగిస్తున్నారు. దీంతో గతంలో తక్కువగా ఉండే రాగి పంట విస్తీర్ణం ప్రస్తుతం పెరిగింది. ప్రభుత్వాలు సైతం రాగి పంటకు మద్దతు ధరలు కల్పించడంతో రైతులు లాభాలు పొందుతున్నారు.

స్వల్ప కాలంలో చేతికి పంట

మండలంలోని పలు గ్రామాల్లో రైతులు చిరుధాన్యాల పంటల సాగుపై దృష్టి సారించారు. ముఖ్యంగా రాగి సాగుపై ఆసక్తి చూపుతున్నారు. నీటి తడులకు అవకాశం ఉన్న రైతులు రాగితో పాటు వేరుశనగ పండిస్తున్నారు. ప్రస్తుతం రాగులకు మంచి గిరాకీ ఉండడమే ఎక్కువ సాగుకు కారణం. గతంలో గ్రామాల్లో రాగులు, సజ్జలు, కొర్రలు, సామలు, అరికలు వంటి సాగు చేసేవారు. క్రమంగా ఆయా పంటల సాగు తగ్గుతూ వచ్చాయి. ప్రస్తుతం కొన్ని గ్రామాల్లో రాగి, కొర్ర పంటలు సాగు చేస్తున్నారు. గ్రామాల్లో చాలా మంది ప్రజలు ఆహారంగా రాగి సంగటి, రాగి జావలు అధికంగా వాడుతున్నారు. షుగర్‌ వ్యాధిగ్రస్తులు ఎక్కువగా రాగి సంగటి, రాగి జావను ఆహారంగా తీసుకోవడానికి ఇష్టపడుతున్నారు. మండల పరిధిలోని ఆలేడ్‌, కుదురుమల్ల, ఈర్లపల్లి తండా హంసంపల్లి, చెట్టుపల్లి, హస్నాబాద్‌ తదితర గ్రామాల్లో రాగి సాగు అధికంగా ఉంది.

మేలైన రకాలు

రాగి పంటలో అధిక దిగుబడినిచ్చే రకాల్లో మేలైనది మారుతి. ఈ రకం 85 రోజుల నుంచి 90 రోజుల వరకు పంట పూర్తవుతుంది. తెగుళ్లను తట్టుకుని ఎకరాకు 10 క్వింటాళ్ల వరకు దిగుబడినిస్తుంది. అన్ని ప్రాంతాల్లో సాగు చేసేందుకు వీలుగా ఉంటుంది. మిగతా రకాలైన మేగవతి, సువర్ణముఖి, వకుల, భారతి, హిమా, శ్రీచైతన్య రకాలు సైతం అధిక దిగుబడిని ఇస్తాయి.

ఆరోగ్యానికి రక్ష

రాగులను ఆహారంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చు. రాగులతో చేసిన సంగటి, రాగి జావ తీసుకుంటే ఎంతో మంచిది. రాగుల్లో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. 100 గ్రాముల రాగుల్లో 364 మిల్లీ గ్రాముల కాల్షియం ఉంటుందంటున్నారు నిపుణులు. కాబట్టి, రాగులను ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా.. ఇందులో ఉండే కాల్షియం ఎముకల దృఢత్వానికి తోడ్పడుతుందంటున్నారు. అలాగే దంతాలు గట్టిగా ఉండేలా చేస్తుందని చెబుతున్నారు. అధిక బరువుతో బాధపడేవారికి ఇది ఉపయుక్తంగా ఉంటుంది.

సన్మానం.. రెండో'సారీ'



పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం చేస్తున్న పంచాయతీ కార్యదర్శి మీన

దోమ: దళితులను అవమానిస్తే సహించబోమని దళిత సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం బొంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం పంచాయతీ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం చేశారని తెలిపారు. ప్రత్యేకాధికారి వెంకట్‌, పంచాయతీ కార్యదర్శి మీన.. ఇతర కులాలకు చెందిన సిబ్బందికి శాలువాలు కప్పగా.. దళితులకు టవల్‌ కప్పారని మండిపడ్డారు. దీన్ని ఖండిస్తూ ఆందోళనకు దిగడంతో.. జరిగిన తప్పిదాన్ని గుర్తించిన సెక్రటరీ కొత్త శాలువాలు తెప్పించి మళ్లీ సన్మానం చేశారు. దళితులంటే ఎంతో గౌరవమని, శాలువాలు అందుబాటులో లేకపోవడంతో అనుకోకుండా అలా జరిగిందని, ఉద్దేశ పూర్వకంగా చేయలేదని తెలిపారు. సెక్రటరీ మాటలతో దళిత నేతలు శాంతించడంతో వివాదం సద్దుమణిగింది.

'లైన్‌' క్లియర్‌!



విద్యుత్‌ తీగల కిందనున్న చెట్లను నరికివేసిన సిబ్బంది

ధారూరు: పచ్చని చెట్లే ప్రగతికి మెట్లని చిన్నప్పుడే మనమందరం చదువుకున్నాం. ప్రాణ వాయువును అందించే అలాంటి వృక్షాలు అధికారుల అనాలోచిత చర్యకు పీడింపబడుతున్నాయి. విద్యుత్‌ తీగలకు అడ్డుగా వస్తున్నాయని సిబ్బంది చెట్లను కాండం వరకు వధించింది. మండల కేంద్రంలోని చౌరస్తా నుంచి మండల కార్యాలయాలకు వెళ్లే దారిలో పెంచిన చెట్లను మధ్య వరకు నరికివేశారు. ముందుగానే మొక్కలను విద్యుత్‌ తీగలు లేక సురక్షిత ప్రాంతంలో నాటితే ఈ పరిస్థితి వచ్చేది కాదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

వయోవృద్ధులను గౌరవించాలి

జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి కృష్ణవేణి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణవేణి

అనంతగిరి: వయోవృద్ధుల దశ అనేది చాలా గొప్ప దశని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి బి.కృష్ణవేణి అన్నారు. గురువారం అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవాన్ని వికారాబాద్‌ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వయోవృద్ధులకు సమస్యలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 14567 హెల్ప్‌ లైన్‌ నంబర్‌ ఏర్పాటు చేశారన్నారు. జిల్లాలో మొత్తం వయోవృద్ధులు 1,09,658 ఉన్నారని వారిలో 41,033 మందికి నెలకు 2,016 చొప్పున వృద్ధాప్య పెన్షన్‌ వస్తుందన్నారు. వయోవృద్ధులకు ఎటువంటి సమస్య వచ్చినా తమ కార్యాలయాన్ని సంప్రదించాల్సిందిగా కోరారు. అనంతరం చైల్డ్‌ వెల్ఫేర్‌ కమిటీ చైర్‌ పర్సన్‌ వెంకటేశ్‌ మాట్లాడుతూ.. వయోవృద్ధుల అనుభవాల నుంచి మనం చాలా నేర్చుకోవాలన్నారు. వయోవృద్ధుల సమస్యల కోసం ప్రభుత్వం పోషణ సంరక్షణ చట్టాన్ని గ్రామస్థాయి నుంచి మండల స్థాయిలో అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో చైల్డ్‌ వెల్ఫేర్‌ కమిటీ సభ్యుడు సంగమేశ్వర్‌, చైల్డ్‌ డెవలప్‌మెంట్‌ ఆఫీసర్స్‌ మెహరునిసా బేగం, కాంతారావు, ప్రవీణ, వెంకటేశ్వరమ్మ, రజిత, సీనియర్‌ అసిస్టెంట్‌, జహీరుద్దీన్‌, రాములు, ఎఫ్‌ఆర్‌ఓ వెంకటేశ్‌, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది, వయోవృద్ధులు పాల్గొన్నారు.

ఇంటి తాళం పగలగొట్టి లూటీ

నాలుగు తులాల బంగారం చోరీ

యాచారం: ఇంటి తాళాలు పగలగొట్టి చోరీ చేసిన ఘటన హైదరాబాద్‌ గ్రీన్‌ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని ఆకులామైలారంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అవారు జంగయ్య మూడు రోజుల కింద నగరంలోని బంధువుల ఇంటికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. తిరిగి గురువారం ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో ఉన్న నాలుగు తులాల బంగారం, రూ.10 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్‌టీం పోలీసులు ఇంటిని సందర్శించి వివరాలు సేకరించింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహారావు తెలిపారు.

తిరుమలకు జిల్లా కళాకారులు



తిరుపతి బ్రహ్మోత్సవాల్లో నృత్య ప్రదర్శన ఇవ్వనున్న కళాకారుల బృందం ఇదే..

తాండూరు టౌన్‌: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి ఈ నెల 12న వరకు నిర్వహిస్తున్న శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో జిల్లా కళాకారులు పలు నృత్య ప్రదర్శనలు ఇవ్వనున్నారు. తాండూరుకు చెందిన జానపద కళాకారుడు, డ్యాన్స్‌ మాస్టర్‌ అశోక్‌ నేతృత్వంలో తాండూరులోని శ్రీసరస్వతీ శిశు మందిర్‌, బంట్వారం మోడల్‌ స్కూల్‌ విద్యార్థులు ఉత్సవాల్లో పాల్గొననున్నారు. ఈ నెల 7, 8 తేదీల్లో మొత్తం 80 మంది విద్యార్థులు తెలంగాణ కళారూపాలు లంబాడీ గుస్సాడీ, కోయ, థింసా, పులివేషాల ప్రదర్శనలను ఇవ్వనున్నారు. వీరితో పాటు డప్పు కళాకారులు అంజిలప్ప, పెంటయ్య, అనంతయ్య, కృష్ణ, రవికాంత్‌, కృష్ణయ్య, శేఖనప్ప తదితరులు పాల్గొననున్నారు. నృత్య ప్రదర్శనకు అవకాశం ఇచ్చిన తిరుమల తిరుపతి దేవస్థానం వారికి కృతజ్ఞతలు మాస్టర్‌ అశోక్‌ తెలిపారు.

'ఫ్యామిలీ' కార్డుతో పారదర్శకత

తాండూరు సబ్‌ కలెక్టర్‌ ఉమాశంకర్‌ ప్రసాద్‌



పగిడిపల్లిలో సర్వే పరిశీలిస్తున్న సబ్‌ కలెక్టర్‌

యాలాల: తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్‌ కార్డుతో సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత నెలకొనే అవకాశం ఉందని తాండూరు సబ్‌ కలెక్టర్‌ ఉమాశంకర్‌ ప్రసాద్‌ అన్నారు. గురువారం మండల పరిధిలోని పగిడిపల్లి గ్రామంలో ఫ్యామిలీ డిజిటల్‌ కార్డుపై గ్రామంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిజిటల్‌ కార్డు అమలు పైలెట్‌ ప్రాజెక్టుగా యాలాల మండలం పగిడిపల్లి గ్రామాన్ని ఎంపిక చేశామన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి సర్వే నిర్వహించి కుటుంబాలను నిర్ధారిస్తారు. అనంతరం సదరు కుటుంబానికి ఒక గుర్తింపు సంఖ్యను కేటాయిస్తారు. ఈ డిజిటల్‌ గుర్తింపు సంఖ్యతో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు వినియోగిస్తారు. ఇది ఆధార్‌ కార్డు నంబరు ఉన్నట్లే వీటికి నంబర్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ అంజయ్య, ఎంపీడీఓ పుష్పలీల, ఎంపీఓ యాదయ్య, మాస్టర్‌ ట్రైనీ గాజుల వీరేశం తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు

అధికారులను ఆదేశించిన కలెక్టర్‌ ప్రతీక్‌జైన్‌



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్‌

అనంతగిరి: వరి ధాన్యం సేకరణకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ ప్రతీక్‌ జైన్‌ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్‌.ఉత్తమ్‌ కుమార్‌రెడ్డి, సీఎస్‌ శాంతకుమారిలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ఖరీఫ్‌ సీజన్‌ వరి ధాన్యం సేకరణ, డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థుల ఉపాధ్యాయ నియామక ప్రక్రియపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా సమీక్షించారు. అనంతరం కలెక్టర్‌ ప్రతీక్‌ జైన్‌ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా వరి ధాన్యం సేకరణ కేంద్రాలను పరిశీలించి, కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ధాన్యం సేకరణ కేంద్రాల్లో వ్యవసాయ శాఖ, పౌర సరఫరాల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. దొడ్డు, సన్న ధాన్యాన్ని వేరు వేరుగా సేకరించే విధంగా ప్రణాళిక రూపొందించాలన్నారు. ధాన్యం సేకరణ కేంద్రాల్లో కవర్లు, తేమను కొలిచే మిషన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియను ఈ నెల 5 లోపు పూర్తిచేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకా దేవిని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్‌, సుధీర్‌, తాండూరు సబ్‌ కలెక్టర్‌ ఉమా శంకర్‌ప్రసాద్‌, అసిస్టెంట్‌ కలెక్టర్‌ ఉమాహారతి, డీఆర్‌డీఓ శ్రీనివాస్‌, డీసీఎస్‌ఓ మోహన్‌బాబు, డీఎంసీఎస్‌ విజయలక్ష్మి, వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రెడ్డి, వివిధ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పురుగు మందు తాగిన మేస్త్రీ

ఇంటి నిర్మాణానికి సంబంధించి యజమానితో ఘర్షణ



చికిత్స పొందుతున్న మేస్త్రీ

తాండూరు రూరల్‌: ఇరువురి మధ్య ముదిరిన నగదు పంచాయితీ పోలీసుల వద్దకు చేరుకుంది. ఇంటి నిర్మాణ కూలీ డబ్బుల విషయమై ఓ మేస్త్రీ కరన్‌కోట్‌ పోలీస్‌ స్టేషన్‌ సమీపంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ సంఘటన గురువారం గౌతపూర్‌ శివారులో చోటు చేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం.. మండలంలోని సిరిగిరిపేట్‌ గ్రామానికి చెందిన యాదప్ప నూతన ఇంటి నిర్మాణాన్ని గతంలో చేపట్టారు. అందుకు తాండూరు పట్టణం సాయిపూర్‌కు చెందిన తాపీమేస్త్రీ అనిల్‌తో రూ.1.20 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. అయితే యాదప్ప నుంచి తనకు మరిన్ని డబ్బులు రావాలని మేస్త్రీ ఇటీవల గొడవపడ్డారు. ఈ విషయమై కరన్‌కోట్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు సైతం ఇరువురు చేసుకున్నారు. ఈ క్రమంలోనే గురువారం అనిల్‌ తన వెంట తెచ్చుకున్న పురుగు మందు తాగి స్టేషన్‌లోపలికి వెళ్లి హల్‌చల్‌ చేశాడు. వెంటనే పోలీసులు గమనించి తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం మేస్త్రీ అనిల్‌ను వికారాబాద్‌కు తరలించారు.

స్టేషన్‌ బయట తాగాడు

సిరిగిరిపేట్‌లో ఇంటి నిర్మాణానికి సంబంధించి ఇంటి యజమాని యాదప్ప, మేస్త్రీ అనిల్‌ గొడవపడ్డారు. నెల రోజుల క్రితం స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పెద్దల సమక్షంలో ఒప్పందం కుదుర్చుకొని వెళ్లిపోయారు. తీరా గురువారం మళ్లీ ఘర్షణ పడి ఠాణా బయట అనిల్‌ పురుగుల మందు తాగాడు. వెంటనే స్పందించిన పోలీస్‌ సిబ్బంది ఆస్పత్రికి తరలించారు. అనిల్‌ పరిస్థితి నిలకడగానే ఉంది. – ఎస్‌ఐ విఠల్‌రెడ్డి

అందరికీ కార్డులు అందజేస్తాం

ఆర్డీఓ వాసుచంద్ర



కుటుంబ సభ్యుల వివరాలు సేకరిస్తున్న ఆర్డీఓ వాసుచంద్ర

దోమ: గ్రామాల్లోని ప్రతి ఒక్కరికి డిజిటల్‌ కార్డులను అందిస్తామని వికారాబాద్‌ ఆర్డీఓ వాసుచంద్ర అన్నారు. గురువారం దోమ మండల పరిధిలోని ఖమ్మం నాచారం గ్రామం పైలెట్‌ ప్రాజెక్టు కింద ఎంపిక కావడంతో వికారాబాద్‌ ఆర్డీఓ వాసుచంద్ర ఎంపీడీఓ మహేశ్‌బాబు, తహసీల్దార్‌ పురుషోత్తంతో కలిసి ఇంటింటికి తిరుగుతూ కుటుంబ సభ్యుల వివరాలను సేకరించి డిజిటల్‌ కార్డుల నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌ కార్డుకు బదులు కుటుంబ సభ్యుల వివరాలతో నూతన డిజిటల్‌ కార్డులను అందించేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ మేరకు పైలెట్‌ ప్రాజెక్టులో భాగంగా పరిగి నియోజకవర్గంలో ఖమ్మం నాచారం గ్రామాన్ని జిల్లా కలెక్టర్‌ ప్రతీక్‌ జైన్‌ ఎంపిక చేశారన్నారు. ఈ క్రమంలో గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ రేషన్‌ కార్డులు లేని కుటుంబ సభ్యుల వివరాలను సేకరించి వారికి డిజిటల్‌ కార్డులను అందించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ సోమలింగం, పంచాయతీ కార్యదర్శులు హలీం, జమీల్‌, విజయ్‌కుమార్‌, వినోద్‌, రవి, జమీర్‌, జూనియర్‌ అసిస్టెంట్‌ శ్రీనివాస్‌, సీసీ అంజమ్మ, మాజీ సర్పంచులు శాంతకుమార్‌, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



ప్రమాణ స్వీకారం చేస్తున్న పాలకవర్గం సభ్యులు

తాండూరు రూరల్‌: కోత్లాపూర్‌ శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని ఎల్లమ్మ ఆలయ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కోత్లాపూర్‌ గేటు నుంచి ఆలయం వరకు సీసీ రోడ్డు మంజూరు చేస్తానని చెప్పారు.

నూతన పాలకవర్గం

కోత్లాపూర్‌ శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ నూతన కమిటీ చైర్మన్‌గా నవీన్‌చంద్రరెడ్డి, సభ్యులుగా శాంతప్ప, లాలయ్య, లాల్యానాయక్‌, రాజు, ఈశ్వరమ్మ, లక్ష్మీలను వికారాబాద్‌ జిల్లా దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్‌ మధు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్‌ చైర్మన్‌ రవిగౌడ్‌, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ బాల్‌రెడ్డి, నాయకులు ధారాసింగ్‌, ఉత్తమ్‌చందు, వడ్డె శ్రీను, నారాయణరెడ్డి, సాయిలు, గోపాల్‌, రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ముమ్మర సోదాలు

తలకొండపల్లి: ప్రజాలందరూ చట్టానికి లోబడి వ్యవహరించాని పోలీసులు పేర్కొన్నారు. గురువారం షాద్‌నగర్‌ ఏసీపీ రంగస్వామి ఆదేశాలన మేరకు స్థానికంగా కార్డన్‌ సెర్చ్‌ నిర్వహించారు. ఇద్దరు ఇన్‌స్పెక్టర్‌లు, ఏడుగురు ఎస్‌ఐలు, షాద్‌నగర్‌ సబ్‌ డివిజన్‌ సిబ్బందితో కలిసి చుక్కాపూర్‌, పడకల్‌, గట్టుఇప్పలపల్లి, తలకొండపల్లి తదితర గ్రామాల్లో పోలీసులు పర్యటించారు. పాన్‌, కిరాణ షాపులు తనిఖీ చేశారు. బెల్టు షాపుల్లో అక్రమంగా మద్యం విక్రయాలు, నిల్వ ఉంచడం, నిషేధించబడిన మాదక ద్రవ్యాలు, గంజాయి, నిషేధిత పొగాకు తదితర వాటి కోసం వెతికారు. బెల్టు షాపులపై దాడులు నిర్వహించి వాహనాల తనిఖీలు నిర్వహించారు. వివిధ సెక్షన్ల కింద మూడు కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, డిటెక్టివ్‌ ఇన్‌స్పెక్టర్‌ ప్రశాంత్‌, ఎస్‌ఐలు శ్రీకాంత్‌, వెంకటేష్‌, రాజ్‌ కుమార్‌, సుశీల, విజయ్‌, శరత్‌ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

రైతులకు వ్యవసాయ అధికారుల సూచన



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

అనంతగిరి: పత్తి, కంది సాగులో సస్యరక్షణ చర్యలతో మంచి లాభాలు వస్తాయని ప్రొఫెసర్‌ జయశంకర్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏరువాక కేంద్రం తాండూరు కోఆర్డినేటర్‌ టి.లక్ష్మణ్‌ పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎస్‌.మోహన్‌ రెడ్డి, ఏడీఏ స్వరూపారాణి, మండల వ్యవసాయ అధికారి ఎం.జ్యోతి, వ్యవసాయ విస్తరణ అధికారి కావ్య సంయుక్తంగా వికారాబాద్‌ మండలంలోని జైదుపల్లి గ్రామలో పత్తి, కంది పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా పత్తి పంటలో వడలు తెగులు, పిందె రాలడాన్ని గమనించామని తెలిపారు. వడలు తెగులు నివారణకి లీటర్‌ నీటికి మూడు గ్రాముల కాపర్‌ ఆక్సీక్లోరైడ్‌ లేదా ఒక గ్రాము కార్బండాజిమ్‌ మిశ్రమాన్ని మొక్క మొదలు వద్ద చుట్టూ పోయాలన్నారు. వర్షపాతం తగ్గిన అనంతరం పొలంలో నీరు నిల్వ ఉండకుండా మరుగు నీటిని తొలగించి, ఆ తర్వాత 20 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్‌ మొక్కకు ఐదు సెంటీమీటర్ల దూరంలో వేసుకోవాలని రైతులకు సూచించారు. పిందె రాలడాన్ని నివారించుకోవడానికి ప్లానోఫిక్స్‌ ద్రావణాన్ని 5 లీటర్ల నీటికి ఒక మి.లీ చొప్పున కలిపి 10 నుండి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని సూచించారు. కంది పంటలో ఆకు చుట్టు పురుగు, ఎండు తెగులు ఉధృతిని గమనించి వాటి నివారణ చర్యల గురించి రైతులకు తెలిపారు. ఆకు చుట్టు పురుగు నివారణకి ఐదు శాతం వేప గింజల కషాయం లేదా ప్రొఫెనోఫాస్‌ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.